# "నటనాభిరామం"

నట రాస్కెల్సంటే నవ్వుతున్నారా? నిజంగా అలాటివాళ్ళు ఈ భూప్రపంచకంలో వుంటే వాళ్ళని అలా అనగలమా? ఎంత మాటైనా అనాలంటేవాళ్ళమీద మనకు వుండాల్సింది ప్రేమ - లవ్వు కాదు. రాస్కెల్సంటే లవ్వెందుకుండాలి? లవ్వుకి ప్రేమకీ తేడాతెలీని వాళ్ళు లవ్ లెటర్స్ రాసేస్తూంటారు? లవ్వు అయిపోగానే తగ్గి పోతుంది. లా ఆఫ్ డిమినిషింగ్ రిటన్సు వస్తుంది. ప్రేమ అలాక్కాదు ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును. ఇచ్చినకొద్దీ కాబూలీ అప్పులా ఏదైతే పెరుగుతుందో అది అసలు సిసలైన వడ్డీకన్నా ఎక్కువయిన ప్రేమ.

భార్యా భర్తలున్నారనుకోండి. వాళ్ళ మధ్య ప్రేమ వున్నా తగ్గినా కోడి పుంజుల్లా దెబ్బలాడుకుంటారనుకోండి. అప్పుడు ఎవరయినా గెస్టు దేముళ్ళా రాగానే వాళ్ళు కలిసిపోయి ఒకరి మీదొకరు ప్రేమలు గుమ్మరించుకుంటారు. మర్యాదలు ఒలక బోస్తారు. నవ్వులు పువ్వుల్లా చిమ్ముతారు  అదండీ నటన వాళ్ళని నట రాస్కెల్సంటారు.

కవులున్నారనుకోండి ఒకరంటే ఒకరికి ఛస్తే పడదు. వాడి మొగం వాడికి కవిత్వం ఏవిటి కాపీ రాగం అలపిస్తాడు. వాడి పోయమ్స్సన్నీ ఫలానా ఫలానా ఫలానాకి డిటో - ఆవేశం వాడిది ఆయాసం వీడిది అని తిట్టిపోస్తాడు. ఎవడికయినా ప్రయిజో అవార్డో రొట్టెముక్కో బిస్కట్ ముక్కో దొరికిందనుకోండి. ఆ అవార్డు వాడు కాకాపట్టి రికమండేషన్లూ, ఆవదమూ కొబ్బరినూనె కలిపి రాసి సంపాదించాడు. నూతిలోంచి మట్టి తీసినట్లు లాగు తాడు. వెధవ ఐడియాలూ వీడూనూ వీడికి వ్యాకరణం రాదు. ఛందస్సు తెలీదు. బోడి కవిత్వం వీడూనూ - ఆ పాటి నేను రాయలేనా రాసి చూపించలేనా అంటారు. ఎదటి వాడి విజయాన్ని కాలరాసి వాడికున్న కీర్తిని మట్టి కరిపించాలని చూస్తారు. సరే - లోకోభిన్న ఆవరుచిః అని వూరుకుందాం అంటే మళ్ళీ మీటింగుల్లో అన్నగారు  అంటూ వారి కవిత్వంలో మునిగి తేలడం వల్లనే పవిత్రులం అయ్యామనీ, వారిది సముద్రం లాటి హృదయమనీ, వారి వాక్చాతుర్యం శబ్దమాధుర్యం ఎట్సెట్రాలు ఆ కలభాషిణికీ సరస్వతికి కూడా లేవని సభల్లో కావిలించుకుని మరీ పొగుడ్తారు. వారి వల్ల యీ భూమి పునీతమయిందనీ, వారి కవిత్వానికి సంతోషించే చంద్రుడు వెన్నె లలు కాయిస్తున్నాడనీ, గాలి వీస్తున్నదనీ అతిశయోక్తులు పరిపరి విధాల కూస్తారు. వీళ్ళని నట స్కౌండ్రల్సు అంటారు.

ప్రతి వీధిలోనూ తమకేదైనా ఎవరివల్లయినా ఆవగింజంత వుపకారం జరగాల్సి వస్తే కొబ్బరి కాయంత పొగడ్త వారి నెత్తి మీదకొట్టి వారిచేత పన్లుచేయించుకుంటారు. ఆ కాస్తా ఉపకారం జరిగాక - పడవదాటాక బోడి మల్లయ్య స్టయిల్లో ఏంటయ్యా - ఏదో చిన్న సహాయానికి వస్తే చేశావ్. ఆ మాత్రానికి ఎక్కడ కనపడ్డా నీకు దాసోహం అంటూ నీ చుట్టూ తిరగాలా? నీకు మొక్కాలా? అంటూ ఎదురుదాడి సాగిస్తారు. ఇలాటి వాళ్ళని కూడా నట రాస్కెల్స్ అనొచ్చు.

మనింటికొచ్చిన పంచదార, పాలు, పెరుగు కందిపప్పు, ఫ్రిజ్ లోంచి అయిసుముక్కలు, నీళ్ళ సీసాలు అన్నీ పట్టిగెళ్ళి తిరిగి ఇవ్వరు. సరికదా మనకేదైనా అవసరం వచ్చి మళ్ళీ అడిగితే యాగీచేస్తారు. అలాటి వాళ్ళని కూడా నట రాస్కెల్సు జాబితాలో చేర్చవచ్చు.

జాకెట్లు కుట్టిపెట్టమనీ, గౌన్లు కత్తిరించి కుట్టమనీ చీరలకి ఫాల్స్ వేసియిమ్మనీ తయారవుతారు. యింట్లో కుట్టు మిషనువుండి అన్నిరకాల కుట్లువస్తే యిక మనకి హోమ్‌వర్క్ యిచ్చేసి వాళ్ళు మ్యాట్నీ సినిమాలకి చెక్కేస్తూ వుంటారు. వాళ్ళని నటస్కౌండ్రల్సన్నా తప్పు లేదు.

మరోరకం మధుర భాషణులున్నారు. వారు చాలా తీపిగా మాటాడ్తారు. ఇలావచ్చి అప్పుడే వచ్చిన వీక్లీలనీ, మంత్లీలనీ, సినిమా పత్రికల్నీ మనం యింకా పేజీ తిప్పకుండానే పట్టుకుపోయి చింపిపోగులెట్టి మళ్ళీ మన పిల్లల్ని పంపించి అడిగినా కనిపించడంలేదని బుకాయిస్తారు. ఇంకా కొంత మంది న్యూస్ బాయిస్‌కి దారికడ్డంపడి వాడి చేతల్లోంచి లాక్కుని చదివి మర్నాడో ఆ మర్నాడో మూడో నాడో మన మొహాన పారేస్తారు. వీళ్ళంతా నట రాస్కెల్స్.

నవలల పిచ్చొళ్ళుంటారు. వారు పుస్తకాలు తీసుకెళ్ళి బాల్‌పాయింట్ పెన్నుతో అండర్‌లైన్ చేస్తారు పుస్తకం అంతా. పక్కనసైడ్ కామెంట్సు రాసారు. అట్టలు విరిచి చదువుతారు. ఆ చదువుతోన్న నవలల్ని పచ్చడి రాచిప్పలు (యిప్పుడు రాచిప్పలు లేవు గిన్నెలమీద పాలగిన్నెలమీద నూనెడబ్బామీద మూతలు పెడతారు. వీళ్ళు స్వయంగా వచ్చి మన అలమరాలో గూట్లో టేబుల్మీదా చేతులేసి కెలికి కావలసినవి పట్టుకుపోతారు స్వేచ్ఛగా. పుస్తకాలు తిరిగివ్వరు. యిచ్చినా అందులో మొదటిపేజీలు చివరిపేజీలు మిస్సింగు. అవి కొత్తరూపు కోల్పోయి చెడిపోయిన బజారు మనుషుల్లా వుంటాయి. ఇలాంటి వాళ్ళను కూడా నటస్కవుండ్రల్సనొచ్చు.

“నట” ఎందుకంటే మనం యిచ్చే దాకా ప్రేమ. ఆప్యాయం, ఆపేక్ష అన్నీ వలకబోస్తారు. తీరా ఇచ్చాక నాశనం చేసి నవ్వుతూ మన్ని ఏడిపిస్తారు.

ఈ సంఘంలో ఉత్తమాభిరుచుల్ని మరో కళ్ళతో పంచుకుని ఆనందించాలంటే కుదరదు ఎక్కడో ఎప్పుడోగాని

ఇహ పిల్లలు – వీళ్ళూ నటరాస్కెల్స్; ఎల్లాగంటారా?

అమ్మ పొంట్లిచ్చి స్టీలు గిన్నె కొందని, గుమ్మందగ్గిర బట్టలవాడొస్తే చీరలు కొందని, యిలా గుమ్మం దగ్గిర చేసే బేరాలన్నీ తండ్రి రాగానే చెప్పేస్తారు. పూసగుచ్చినట్లు, మళ్ళీ ఏ తల్లయినా పిల్లల మీద తండ్రితో నేరాలు చెప్పలేదు. తల్లి దగ్గర అవీ యివీ అడిగి డబ్బులు బెల్లించి తల్లిమీద నేరాలు చెప్పి తండ్రి దగ్గర సి.ఐ.డీ.ల్లా మెప్పు పొందాలని తాపత్రయపడే పిల్లల్ని నటస్కౌండ్రల్సు అనొచ్చు.

ఆఫీసుల్లో కూడా బాస్‌కి రిపోర్టులు చేరేసే వార్ కరస్పాండెంట్సు వుంటారు. వారు పనిచేసేవాళ్ళమీదా, తమకు గిట్టనివారి మీద. తమకు లొంగి వుండని వారిమీదా పితూరీలు చెప్తూ వుంటారు. మంచివాళ్ళని చూస్తే కడుపుమంట వీళ్ళకి. ఈర్ష్యాళువులు వీళ్ళు. సూర్యుని

మీద ఉమ్మేస్తారు. ఆకాశాన్ని తిడతారు. సముద్రాన్ని కాలితో తంతారు. వీళ్ళని కూడా నటస్మాంద్రల్స నొచ్చు. ఇంతకీ నట పూల్సెవరని మీరడగొచ్చు. ఇంకెవరు? ఇన్ని బాధలు పడే మనమే. ఏడ్వలేక నవ్వుతూ తిరిగేస్తాము.

ఆ నటపూల్సుమి మనమే; మనమే;

# 'దేశ భాషలందు తెలుగు లెస్స'

'మమ్మీ డాడీ' చదువు లొచ్చాక 'తల్లీ నిన్ను దలంచి పుస్తకము' ఎగిరి పోయింది. నన్నడిగితే 'వేయిపడగలు' విలవ పెరిగిందంటాను. కాన్వెంటు చదువు లొచ్చాక అన్ని పడగలూ పోయి ఆ వున్న ఒక పడగకూడా ఎగిరిపోయింది. తెలుగు 'మమ్మీ'ల వ్యామోహం పుణ్యాన విశ్వనాధ వారు వేయిపడగల్లో తిట్టిన దానికన్నా ఎక్కువ తిట్టాలి. 'మమ్మీ డాడీ కల్చరు' కోసం తెలుగుతనాన్ని, తెలుగు ఆత్మాభిమానాన్ని, తెలుగు పౌరుషాన్ని మంట కలిపేస్తున్న తెలుగు 'మమ్మీ'ల్ని.

భాగవతంలో శ్రీకృష్ణుడు మన్ను తిన్నాడని యశోద నోరు తెరవమన్నపుడు ఆ చిన్ని కృష్ణుడు మమ్మీ మన్ను తినగం నేశిశువునో ఆకొంటినో వెర్రినో' అని చదవాల్సిన పరిస్థితి యిప్పుడొచ్చింది. నోరారా యింటికి రాగానే పిల్లలు 'అమ్మా' అనకుండా యీ 'మమ్మీ' గోలెక్కడ్నుంచి వచ్చి పడిందర్రా అని మా మేనత్తగారు 'మమ్మీ - డాడీ' గాళ్ళని తిట్టిన తిట్టు తిట్టకండా దులిపేస్తూ వుంటారు కాని. మమ్మీడాడీ గాళ్ళకు 'నర్సరీ రైమ్స్ డింగ్ డాంగ్ బెల్లూ' తెలిసి నట్లు - కృష్ణ శతకం, సుమతీ శతకం దాశరథీ శతకాలు తెలవ్వు కదా; అంచేత విశ్వనాధవారు యింకా రెండు పడగలున్నాయని ఆ నవల్లో పొంగిపోయారు కాని కాన్వెంట్ల పిచ్చి గురించి వారుకాసుకోలేక పోయారు. ఆరెండు పడగల్నీ కూడా తెలుగు మమ్మీలు వూడగొట్టేశారు గోవిందా అని.

ఓ సారి లండన్లోనో మాంచెస్టర్లోనో విగాన్ అనే చోటనో వో టాక్సీ డ్రైవరు మా వారి ఇంగ్లీషు భాషాజ్ఞానాన్ని మెచ్చుకుంటూ - మీకు ఇంత ఇంగ్లీషు మా చరిత్ర మా సాహిత్యం గురించి ఎలా తెలుసు అని అడిగాడ్ట. దాన్తో పొంగిపోయి ఆయనో టాక్సీవాడికి చిన్నప్పటినుంచీ అనగా ఫస్ట్‌ఫాం నుంచీ డిగ్రీదాకా అంతా ఇంగ్లీషేకదా మేంచదివిందీ అని గొప్పగా చెప్పార్ట. అప్పుడా డ్రయివరు "మీకు మాతృభాషలేదా ఆ భాషలో మీరు ఎందుకు చదువుకోరు" అని ప్రశ్నించాడ్ట. ఇంగ్లీషువాళ్ళు మాదేశాన్ని పరిపాలించారు. అప్పుడు వాళ్ళ చదువులు చదువుకోవడానికి యింగ్లీషు నేర్చుకున్నాను. మా కంట్రీలో మద్రాసు అని వో వూరుంది. అక్కడ యింగ్లీషు తీసేస్తామంటే కొందరు కిరసనాయిలు మీదోసుకుని చచ్చారు. మా